**తగ్గుతారా..**
**సై అంటారా..!**







**న్యాయవాదిపై దాడి గర్హనీయం**


AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## ప్రమాణ స్వీకారానికి రావాలని ఆహ్వానం..



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్‌గా ఈనెల 26న గోనె లహరి, వైస్ చైర్మన్‌గా కాట్‌పల్లి వెంకటరెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని సోమవారం అయన నివాసంలో వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి ఏబీ చిన్న, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గోనె లహరి రఘు, వైస్ చైర్మన్ కాట్‌పల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.





## డిప్యూటీ మేయర్ బాధ్యతల స్వీకరణ

**అక్షరటుడే, ఇందూరు :** నిజామాబాద్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల కాంగ్రెస్ ఎంఐఎం పార్టీల పొత్తుతో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే ఎంఐఎంకు చెందిన 54వ డివిజన్ కార్పొరేటర్ సల్మాను డిప్యూటీ మేయర్‌గా ఎన్నుకున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం మేయర్ ఉమారాణి నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు ఫయాజ్, షకీల్, కార్పొరేటర్లు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు. మేయర్‌గా కూరగాయల ఉమారాణి బాధ్యతలు చేపట్టారు. ఈనెల 16న కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె ఛార్జ్ తీసుకున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



## కామారెడ్డిలో అవినీతి రహిత పాలన అందించాలి: షబ్బీర్ అలీ

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణ ప్రజలకు అవినీతి రహిత పాలన అందించాలని కొత్తగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నూతన ఛైర్‌పర్సన్‌గా ఎన్నికైన ఇప్ప ఉమారాణి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీ సురేష్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపాలిటీలో లక్షకు పైగా ఓటర్లు పెరిగారని, రాబోయే ఐదేళ్లలో కామారెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ కాబోతుందన్నారు. కామారెడ్డి ప్రజలు తమపై నమ్మకంతో గెలిపించారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ముందుకువెళ్తూ కామారెడ్డి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని ఛైర్ పర్సన్‌కు సూచించారు. వచ్చే వేసవి కాలంలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కామారెడ్డికి ఎలాంటి నిధులు కొరత లేకుండా సీఎంతో మాట్లాడి అన్ని సమస్యలు పరిష్కారం చేయడానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధు మోహన్, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్ రెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ కార్పొరేషన్ నూతన పాలకవర్గం కొలువు తీరింది. ఇటీవల మేయర్, డిప్యూటీ మేయర్ బాధ్యతలు సైతం స్వీకరించారు. అయితే నగరపాలక సంస్థలో సమస్యలు సవాళ్లు విసురుతున్నాయి. ఏళ్లుగా తిష్ట వేసిన సమస్యలకు పరిష్కారం అంతంతమాత్రంగానే లభిస్తుంది. పారిశుధ్య నిర్వహణ, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, రోడ్లు, అక్రమ నిర్మాణాలు ఇలా అనేక సమస్యలు నూతన పాలక వర్గానికి స్వాగతం పలుకుతున్నాయి.

**- అక్షరటుడే, ఇందూరు**

# సమస్యల సవాళ్లు

- **నగరంలో అనేక సమస్యలు**
- **పలు కాలనీల్లో వసతులు కరువు**
- **కొత్త పాలకవర్గంపై ప్రజల ఆశలు**

నిజామాబాద్ కార్పొరేషన్‌లో మొత్తం 60 డివిజన్లు ఉన్నాయి. సుమారు మూడున్నర లక్షల మంది జనాభా ఉంది. అయితే అనేక సంవత్సరాలుగా నగరంలో సమస్యలు తిష్ట వేశాయి. ప్రధానంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు గుదిబండలా మారాయి. సుమారు 20 ఏళ్ల నుంచి పనులు కొనసాగుతున్నాయి. ఈ పథకానికి సుమారు రూ.300 కోట్లు ఖర్చుపెట్టినప్పటికీ పూర్తిస్థాయిలో పనులు జరగలేదు. ఇప్పటికీ పలు కాలనీల్లో యూజీడీ పనులు కనీసం ప్రారంభం కూడా కాలేదు. అలాగే నగర శివారులోని కొన్ని గ్రామాలు విలీనమయ్యాయి. వాటిల్లోనూ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ అత్యంత దారుణంగా మారింది.

### పారిశుధ్యంపై పట్టింపు కరువు

నగరంలో ప్రధాన సమస్య పారిశుధ్య నిర్వహణ. నగర జనాభా, కాలనీల విస్తరణకు అనుగుణంగా సిబ్బంది లేకపోవడమే పారిశుధ్య లోపానికి కారణంగా మారింది. డ్రెయినేజీలను రెగ్యులర్‌గా తీయకపోవడం, పలు ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ నిత్యం జరగకపోవడం పరిపాటిగా మారింది.

### పన్ను బకాయిలు

నగరపాలక సంస్థలో పన్ను బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. ప్రధానంగా ఆస్తి పన్ను, కుళాయి పన్నుతో పాటు దుకాణాల లైసెన్సులు రెన్యువల్ చేయించడంలో నగరపాలక సంస్థ అధికారులు విఫలమవుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. అన్నీ కలిపి సుమారు రూ.100 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. నగరంలోని అనేక వ్యాపార సముదాయ భవనాల పన్నులు ప్రజా ప్రతినిధులు, అధికారుల అండదండలతో చెల్లించడం లేదు.



### ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు

నగరంలో వెజ్, నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు రెండు చోట్ల నిర్మించారు. గత ప్రభుత్వ హయాంలో వాటి నిర్మాణ పనులు పూర్తయినా.. ఇప్పటివరకు వాటిని వ్యాపారులకు కేటాయించలేదు. దీంతో కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోంది. వాటిలోని డోర్లు, కిటికీలు పాడయ్యాయి. ఖాళీగా ఉన్న మార్కెట్లను కొందరు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మార్చుకుంటున్నారు. నూతన పాలకవర్గం వాటిపై దృష్టి సారించాలని వ్యాపారులు కోరుతున్నారు.

### అక్రమ నిర్మాణాలు

నగరంలో పలుచోట్ల అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కొన్నిచోట్ల అధికారులు వాటిని నిలిపివేస్తున్నా... మరికొన్ని చోట్ల మాత్రం యథేచ్ఛగా పనులు చేపడుతున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగం అధికారులు వాటిని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలోనూ అవినీతికి పాల్పడినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని, అవినీతి అధికారుల పనిపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రతి సమస్యపై దృష్టి



నగరంలోని ప్రతి సమస్యపై దృష్టి సారిస్తాం. కార్పొరేటర్లు, అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తాను. కార్పొరేషన్ కార్యాలయంలో ఎలాంటి అవినీతి లేకుండా చూస్తాను. త్వరలోనే అధికారులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేస్తాను. ఇకపై పారిశుధ్య నిర్వహణ లోపం లేకుండా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తాం. పన్ను బకాయిలు సైతం రెగ్యులర్‌గా వసూలు చేసేలా చూస్తాం.

**– ఉమారాణి, నగర మేయర్**



## కామారెడ్డి డీఎంహెచ్‌వోగా రవీందర్ గౌడ్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** కామారెడ్డి డీఎంహెచ్‌వోగా డాక్టర్ రవీందర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం ఆయన డీఎంహెచ్‌వోగా ఛార్జ్ తీసుకున్నారు. అనంతరం కార్యాలయం సిబ్బందితో సమావేశం అయ్యారు. ఎల్లారెడ్డి మున్సిపల్ 5వ వార్డు గండి మాసానిపేట్ గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సాయాగౌడ్, చంద్రకళ దంపతుల కుమారుడు రవీందర్ గౌడ్ ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1998లో మెదక్ జిల్లాలోని గడి పెద్దాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వ వైద్యుడిగా ప్రస్థానాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి సంగారెడ్డి జిల్లా టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ కంట్రోల్ నోడల్ అధికారిగా ఆరేళ్లపాటు బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన రవీందర్ గౌడ్ డీఎంహెచ్‌వోగా నియమితులు కావడంపై జిల్లా, మండలాలకు చెందిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.



## ఎమ్మెల్యే కేవీఆర్‌ను కలిసిన ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు:** కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని సోమవారం ఆయన నివాసంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా కలిశారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో హింసాత్మక చర్యలకు ఎలాంటి స్థానం లేదని అన్నారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ దాడులకు పాల్పడడం అత్యంత హేయమైన చర్యగా ఖండించారు.

## కామారెడ్డికి ఎల్లో అలర్ట్.. వాతావరణ శాఖ హెచ్చరిక..

**అక్షరటుడే, కామారెడ్డి:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వర్షం కురిసింది. కామారెడ్డి, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, వికారాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసింది. ఈ మేరకు హైదరాబాద్ బేగంపేట వాతావరణ శాఖ వివరాలు వెల్లడించింది. కామారెడ్డి జిల్లాకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది. అల్పపీడనం నేపథ్యంలో నిజామాబాద్ జిల్లాలోనూ వర్షాలు కురిశాయి. ఉదయం కురిసిన వర్షానికి రైతులు ఆందోళన చెందారు. బోధన్ నియోజకవర్గం లోని సాలూర తదితర ప్రాంతాల్లో సుమారు 3వేల ఎకరాలకు పైగా శనగపంట సాగు చేశారు. కోతలు పూర్తయ్యి పంటలను ఆరబెట్టిన క్రమంలో సోమవారం ఉదయం కురిసిన వర్షానికి పంట తడిసిపోయింది. వాతావరణ శాఖ ముందుస్తుగా వర్షాలు పడతాయని హెచ్చరించడంతో రైతులు అప్రమత్తమయ్యారు.

## రాజకీయ లబ్ధి కోసమే కళాశాల ఆస్తుల వివాదం: ఎమ్మెల్యే

**అక్షరటుడే, కామారెడ్డి :** రాజకీయ లబ్ధి కోసమే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తుల అంశాన్ని తెరపైకి తెచ్చారని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, రెవెన్యూ అధికారులను కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల విషయంలో నిజాలు బయట పెట్టాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. డిగ్రీ కళాశాల ఆస్తుల విషయంలో తాను, తన తండ్రి ఏ తప్పు చేయలేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని ఎమ్మెల్యే అన్నారు. నిజాయితీగా ఉన్నవాళ్లకు భయం ఉండదని పేర్కొన్నారు. ప్రభుత్వంలో వాళ్లే ఉన్నారని, రెండు నిమిషాలలో డాక్యుమెంట్స్ తెప్పించే అధికారం ఉందన్నారు. అలాంటప్పుడు ఈ రచ్చ ఎందుకు.. గొడవ ఎందుకు అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. 2004 నుంచి 2009 వరకు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఆ నాడు ఏమి చేయలేదని, ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారుగా ఉన్న ఆయన సీఎం ద్వారా రికార్డులు తెప్పించుకోవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. దీనికి కచ్చితంగా ముగింపు పలుకుతానని తెలిపారు. '263 ఎకరాల్లో భూమిలో 1964 నుంచి ఇప్పటివరకు ఏ భవనానికి ఎంత స్థలం కేటాయించారు.. ప్రజా ప్రయోజనాల కోసం చేశారా.. స్వార్థ ప్రయోజనాల కోసం చేశారా అనేది నిగ్గు తేల్చాలని కలెక్టర్‌ను కోరాను' అని ఎమ్మెల్యే తెలిపారు. కళాశాల ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా భూ సేకరణ చేయడం వల్లే కామారెడ్డిలో అన్ని రకాల ప్రభుత్వ భవనాలు, కళాశాలలు వచ్చాయని, లేకపోతే కామారెడ్డిలో ఏమి ఉండేవి కాదన్నారు. 2004-09 వరకు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డికి తెచ్చే దమ్ము, తెలివి లేదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఒక్క మండలానికి కూడా మోడల్ పాఠశాల తేలేదని విమర్శించారు. తాను జెడ్పీ చైర్మన్‌గా ఉన్నప్పుడు సదాశివనగర్‌కు మోడల్ స్కూల్ తెచ్చానని కేవీఆర్ తెలిపారు. కర్షక్ బీఈడీ, ఇంజినీరింగ్ కళాశాల హైదరాబాద్ వెళ్లిపోతే ఏమి చేశాడని షబ్బీర్‌ను ప్రశ్నించారు. 8.20 ఎకరాల కళాశాల మైదానం దున్నితే దాని వెనకాల ఉన్నది ఎవరని నిలదీశారు. తెరవెనుక రాజకీయ శక్తులు లేకపోతే ఇతర ప్రాంతం వాళ్లు కళాశాల భూమిపై కన్ను ఎలా వేస్తారన్నారు. ఇప్పటికి కామారెడ్డిలో ఆరుగురు బీజేపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారని, తనను లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని ఇంట్లో ఉంచారని, కాంగ్రెస్ వాళ్లను మాత్రం ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. దీనిని బట్టి పోలీసులు ఏం చేస్తున్నారో అర్థం చేసుకోవాలని ప్రజలను కోరారు.



## ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** విధినిర్వహణలో గంజాయి ముఠాను పట్టుకునే క్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రభుత్వం ఆమె సోదరుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చింది. నిజామాబాద్ ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య గతనెల 23న విధి నిర్వహణలో గంజాయి స్మగ్లర్లను పట్టుకునే క్రమంలో నగరంలో వెహికల్ చెకింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో గంజాయితో వస్తున్న ముఠా కారుతో కానిస్టేబుల్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి తొమ్మిది రోజుల పాటు మృత్యువుతో పోరాడిన సౌమ్య జనవరి 31న పంజాగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో మృతి చెందింది. ఈ ఘటనపై ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. విధి నిర్వహణలో గాజుల సౌమ్య చూపిన తెగువ, నిబద్ధత స్ఫూర్తిదాయకమన్నారు. అధికార లాంఛనాలతో ఆమె అంత్యక్రియలు నిర్వహించామన్నారు. స్వయంగా అంత్యక్రియలకు ఆయన హాజరై సౌమ్య కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇస్తామని, సౌమ్య తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. అందులో భాగంగా ఈనెల 6న సీఎం రేవంత్ రెడ్డి చేతులమీదుగా సౌమ్య కుటుంబ సభ్యులకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందించారు. అదేవిధంగా సౌమ్య తమ్ముడు గాజుల శ్రవణ్‌కు ఎక్సైజ్ శాఖ లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి చేతుల మీదుగా సోమవారం అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సంఘటన జరిగిన నెల రోజుల్లోపే సౌమ్య కుటుంబానికి రూ.కోటి, సౌమ్య తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించిందని తెలిపారు. సౌమ్య మరణానికి కారణమైన దుండగులను కఠినంగా శిక్షిస్తామని సౌమ్య కుటుంబానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి, నోడల్ డీపీ ఈవో మల్లారెడ్డి, సీఐ స్వప్న, ఎస్సై మల్లేష్, కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ యూనియన్ అధ్యక్షుడు రవి, కార్యదర్శి చంద్ర మోహన్ పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేను రాజీనామా చేయించడానికే వచ్చాం



**అక్షరటుడే, కామారెడ్డి:** ఎమ్మెల్యే తప్పు ఉందని ఆధారాలతో నిరూపించి రాజీనామా చేయించడానికే కలెక్టరేట్‌కు వచ్చామని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేణి సందీప్ అన్నారు. కలెక్టర్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయవద్దని, ఆధారాలు తీసుకుని కలెక్టర్ వద్దకు వస్తే అధికారుల సమక్షంలో చర్చిద్దామని ఎమ్మెల్యే చెప్తే కలెక్టర్ వద్దకు వచ్చామని సందీప్ పేర్కొన్నారు. అధికారుల సమక్షంలో రికార్డులు తీసి గజం భూమి తేడా వచ్చినా స్పీకర్ ఫార్మాట్ లో రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే ప్రకటించినట్లు గుర్తు చేశారు. అన్ని డాక్యుమెంట్లు తీసుకుని వస్తే ఎందుకు వచ్చారని కలెక్టర్ అడుగుతున్నారని తెలిపారు. శనివారం కూడా శిశుమందిర్ వద్దకు రావాలని పిలుపునిచ్చినప్పుడు ఎమ్మెల్యే వస్తారని చెప్పినా.. ఏ అధికారికి సమాచారం ఇవ్వలేదని, నేడు కూడా కలెక్టరేట్‌కు చర్చకు వస్తున్నట్లు సమాచారం ఇవ్వలేదన్నారు. ఇలా ప్రజలను ఎందుకు తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రశ్నించారు.

## పోతంగల్‌లో రోడ్డెక్కిన ట్రాక్టర్ ఓనర్లు



**అక్షరటుడే, కోటగిరి:** మండల కేంద్రంలోని సోమవారం ట్రాక్టర్ ఓనర్లు రోడ్డెక్కి ధర్నా, రాస్తారోకో చేశారు. ఇసుక కోసం పర్మిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా ప్రవేశపెట్టిన 'మన ఇసుక వాహనం' ఆన్‌లైన్ బుకింగ్ విధానాన్ని పోతంగల్ ఇసుక పాయింట్ వద్ద ఎందుకు చూపించట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక రవాణా చేయలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ట్రాక్టర్ ఓనర్లు యాదుల్, నరేందర్, అనిల్, వీరు, గంగాధర్, సాయిలు, అజీం, జలీల్, సుదర్శన్ పాల్గొన్నారు.





**కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తుల వివాదం ఇప్పట్లో ముగిసే అవకాశం కనిపించడం లేదు. రోజుకో మలుపు తిరుగుతున్న ఈ పంచాయితీ ఎట్టకేలకు కలెక్టర్ చెంతకు చేరింది. నిజానిజాలు నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే కోరడంతో భవిష్యత్తులో ఏం జరగబోతుందన్న ఉత్కంఠ కొనసాగుతోంది. తప్పు నిరూపిస్తే ఎమ్మెల్యే రాజీనామా చేస్తానని చెప్పడం, రాజీనామా చేయించడానికే తాము వచ్చామని ఎన్ఎస్‌యూఐ నాయకుడు సందీప్ చెప్పడంతో ఈ వివాదం ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందోనన్న చర్చ సాగుతోంది.**

– అక్షరటుడే, కామారెడ్డి

# తగ్గుతారా..
# సై అంటారా..!

- వేడి తగ్గని కళాశాల ఆస్తుల వివాదం
- నిజాలు నిగ్గుతేల్చాలని కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యే
- హాట్‌హాట్‌గా కామారెడ్డి రాజకీయం

కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం అయ్యాయని.. వాటిపై రుణాలు తీసుకుని చెల్లించడం లేదనే విషయంపై వారం రోజులుగా కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటలయుద్ధం కొనసాగుతోంది. దీనికి నాటి కమిటీలో ఉన్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బదులు చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేయడంతో ఈ వివాదం తారాస్థాయికి చేరింది. దాంతో ఇరువర్గాల మధ్య మాటలు తూటాలై పేలాయి. శనివారం నాటి ఘటనతో కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా కలెక్టర్ వద్ద తేల్చుకుందామని వెళ్లడంతో ఇప్పటికైనా దీనికి ముగింపు పలుకుతారా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### వేడి తగ్గని వివాదం..

వరుసగా నాలుగు రోజులుగా కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. డిగ్రీ కళాశాల భూముల విషయమై ఏ వర్గం నుంచి ఎలాంటి పిలుపులు వస్తాయోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. అటు పోలీసులు, ఇటు అధికారులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఇరువురిలో ఎవరు తగ్గినా వివాదం సద్దుమణిగే అవకాశం ఉన్నా ఇంకా వేడిని కొనసాగిస్తూనే ఉన్నారు. దాంతో ఈ వివాదానికి ఎప్పుడు ముగింపు పలుకుతారో తెలియని పరిస్థితి నెలకొంది.

### నిగ్గు తేలుస్తారా..?

ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు కొనసాగుతూనే ఉన్నాయి. దాంతో తనపై వచ్చిన ఆరోపణలను తప్పు అని నిరూపించేందుకు ఎమ్మెల్యే సిద్ధమయ్యారు. నేరుగా కలెక్టర్‌ను కలిసి నిజాలు నిగ్గు తేల్చాలని కోరారు. అలా గే సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు కూడా చేశారు. దాంతో భూముల పంచాయితీ ఇప్పుడు కలెక్టర్ చెంతకు చేరింది. దాంతో ఈ వివాదం ఇంకా ఎటువైపు వెళ్తుందోనన్న ఉత్కంఠ కొనసాగుతోంది. సాధ్యమైనంత త్వరగా ముగింపు పలకాలని భావిస్తే ప్రభుత్వం దీనిపై ఏదో ఒక నిర్ణయం తీసుకుని ఆస్తుల విషయంపై ప్రకటన విడుదల చేయాల్సి ఉంది. మరి ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో.. ఎప్పటిలోగా స్పందిస్తారో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

### అధికారులపైనే భారం..

కళాశాల ఆస్తుల పంచాయతీ ప్రస్తుతం అధికారులు ఇచ్చే వివరాలపై ఆధారపడి ఉండడంతో ఒక్కసారిగా వివాదం మలుపు తిరిగింది. ఈ అంశం ఇప్పుడు రాజకీయాల నుంచి అధికారుల వైపు మళ్లిందనే టాక్ వినిపిస్తోంది. దాంతో ఈ విషయంపై ఇరుపార్టీల నాయకులకు సర్ది చెప్పి వివాదాన్ని సద్దుమణిగేలా చేస్తారా.. లేక ఇంకా ముందుకు వెళ్లేలా చేస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాడో పేడో తేల్చుకుంటానని ఎమ్మెల్యే, రాజీనామా చేయించి చూపిస్తామని ఎన్ఎస్‌యూఐ నాయకులు పంతంతో ముందుకు వెళ్తున్నారు. దీంతో సమరానికి సై అన్నట్టుగానే వివాదం ముందుకే వెళ్తుందన్న విషయం అర్థం అవుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### హాట్ హాట్‌గా రాజకీయం..

అభివృద్ధి విషయంలో పోటాపోటీగా ముందుకు వెళ్లాల్సిన నాయకులు వ్యక్తిగతంగా పరస్పర దూషణలు చేసుకోవడంతో కామారెడ్డి రాజకీయాలు హాట్ హాట్‌గా మారాయి. దాంతో ఇప్పటికిప్పుడు కళాశాల ఆస్తులను తెరపైకి తెచ్చి ఇంతలా రాద్ధాంతం చేయాల్సిన అవసరమేమొచ్చిందన్న చర్చ సాధారణ ప్రజల్లో మొదలైంది.

## ఆర్టీసీ కాలనీ అభివృద్ధి కమిటీ కార్యవర్గం ఎన్నిక



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని ముబారక్‌నగర్ ఆర్టీసీ కాలనీ అభివృద్ధి కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా బిల్ల నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మీసాల రోహిత్, కోశాధికారిగా విఠల్ సుమన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ..కాలనీవాసుల సహకారంతో ప్రణాళిక ప్రకారం కాలనీని అభివృద్ధి చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌పై అవగాహన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తిమ్మారెడ్డి జీపీలో సోమవారం రైతులకు జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌పై సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఆచరిత మాట్లాడుతూ రైతులు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలన్నారు. రైతులు అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడుతున్నారని వీటివల్ల భూసారం తగ్గిపోతుందన్నారు. పశువుల ఎరువు, పచ్చిరొట్ట ఎరువులు వేసుకొని భూమిలో కలియదున్నాలని సూచించారు. అదేవిధంగా ఏదైనా పురుగు గాని తెగులుగానీ ఆశించినచో పురుగుమందులు వాడకుండా వేప కషాయం, జీవామృతం పంటల పైన పిచికారి చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో సర్పంచ్ బుజ్జన్న గారి అనసూయ గంగారెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్ అలీ, గోలి వసంతం, కిష్టారెడ్డి ఉప సర్పంచ్ గంగమణి, శ్యాంరావు, రైతులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో ప్రశాంతంగా ఎన్నికలు





**అక్షరటుడే, ఇందూరు:** అందరి సహకారంతో జిల్లాలో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో సోమవారం మున్సిపల్ కమిషనర్‌ను ఎన్నికల విధుల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసిన ఫలితంగానే ఎన్నికలను సజావుగా నిర్వహించుకోగలిగామన్నారు. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలో నగరపాలక సంస్థలో ఎటువంటి తప్పిదాలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయని కలెక్టర్ అన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అందరికీ జిల్లా యంత్రాంగం తరపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రవిబాబు, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్లు జాదవ్ కృష్ణ, ఉమామహేశ్వరరావు, గంగాధర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, రిటర్నింగ్ అధికారులు నర్సయ్య, నరేష్, బస్వంత్, హాఫీజుద్దీన్‌లను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఏవో ప్రశాంత్ పాల్గొన్నారు

## బీజేపీ, బీఆర్ఎస్‌లకు మున్సిపల్ ఎన్నికలు షాక్ ఇచ్చాయి : మానాల




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు బీజేపీ బీఆర్ఎస్‌కు షాక్ ఇచ్చాయని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్, పంచాయతీ ఎన్నికల తర్వాత బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ లు తీవ్ర వైరాగ్యంలోకి వెళ్లిపోయి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయన్నారు. రాబోయే రెండేళ్లలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ఆ పార్టీ నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు సైతం మున్సిపాలిటీలన్నీ తమవేనని బీరాలు పలికారన్నారు. ఎన్నికల తర్వాత పూర్తిగా చతికిలబడ్డారని ఎద్దేవా చేశారు. మతసామరస్యానికి చిహ్నంగా ఉన్న కామారెడ్డి లాంటి ప్రాంతాల్లో చిచ్చురేపే ప్రయత్నానికి బీజేపీ తెరలేపిందని మానాల ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల నుంచి ప్రజలను పక్కదోవ పట్టించడానికి పశ్చిమ బెంగాల్ తరహా అల్లర్లను కామారెడ్డిలో సృష్టించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. రానున్న పదేళ్లలో సైతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అంతర్గత మిత్రులు కేసీఆర్, కేటీఆర్‌లతో కలిసి వచ్చినప్పటికీ బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రాలేదన్నారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముత్యం రెడ్డి, రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శి వేణు రాజ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు వైశాక్షి సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగా ప్రసాద్, జిల్లా ఫిషరీస్ కమిటీ ఛైర్మన్ శ్రీనివాస్, నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సకినాల శివ ప్రసాద్, సాయికిరణ్, కౌశిక్ శివ తదితరులు పాల్గొన్నారు.

## మల్లికార్జున స్వామి ఆలయ వేడుకల్లో ఎమ్మెల్యే



**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి మూడో వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లికార్జున స్వామి దయతో నియోజకవర్గం చల్లగా ఉండాలని కోరుకున్నానన్నారు. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంప్రదాయ బుర్రకథ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, పెద్దసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## న్యాయవాదిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

**అక్షరటుడే, ఇందూరు :** రుద్రూర్‌లో న్యాయవాది కళ్యాణిపై ముష్కరుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి రుద్రూర్ బయలుదేరిన బీజేపీ నాయకులను సోమవారం పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దినేష్ కులాచారి మాట్లాడుతూ.. ఓ వర్గంపై దాడులు చేస్తే సహించేది లేదన్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తి అదుపు తప్పిందని, హిందువులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. బాన్సువాడ, రుద్రూర్‌లో జరిగిన ఘటనలు కేవలం యాదృచ్ఛికం కాదని, పక్కా ప్రణాళిక ప్రకారం జరుగుతున్న దాడులేనని ఆరోపించారు. హిందువులపై దాడులు పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం మౌనం వహించడం వెనక తీవ్రమైన రాజకీయ స్వార్థాలు ఉన్నాయనే అనుమానం కలుగుతోందన్నారు. ఇలాంటి దారుణమైన ఘటనలు జరుగుతుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఎక్కడ దాక్కున్నారని, ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ప్రమోద్ కుమార్, ఆనందరావు, రాజు, బొబ్బిలి వేణు, నరేష్, విజయ్ కృష్ణ, చిరంజీవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

### పోలీసులకు మహిళా న్యాయవాది ఫిర్యాదు

**అక్షరటుడే, బాన్సువాడ :** రుద్రూర్‌లో తనపై దాడి జరిగిందని పేర్కొంటూ మహిళా న్యాయవాది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బోధన్ బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సోమవారం రుద్రూర్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. మహిళా న్యాయవాది తన ఇంటి నుంచి స్కూటీపై బోధన్‌కు వెళ్తుండగా ఓ బాలుడిని కొందరు వ్యక్తులు కొడుతుండడాన్ని గమనించారు. ఏం జరిగిందని ప్రశ్నించిన ఆమెపై ఓ వర్గానికి చెందిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై బాధిత న్యాయవాది రుద్రూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదుపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ రుద్రూర్ ఎస్సైపై బోధన్ ఏసీపీ శ్రీనివాసరావు కు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు రుద్రూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట న్యాయవాదులు ధర్నాకు దిగారు.

## సీఐటీయూ, ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్ట్



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో సీఐటీయూ నాయకులు, ఆశా కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆశవర్కర్ల సమస్యలపై సీఐటీయూ 'ఛలో హైదరాబాద్'కు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పట్టణంలోని సంగమేశ్వర్ కాలనీలో సోమవారం ఉదయం సీఐటీయూ నాయకుడు జె.రవీందర్‌ను హౌస్ అరెస్ట్ చేశారు. అదే సమయంలో ఆశా వర్కర్లు వాహనంలో హైదరాబాద్‌కు బయలుదేరుతుండగా బోర్లం గ్రామం వద్ద పోలీసులు అడ్డుకుని, వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సీఐటీయూ నాయకుడు రవీందర్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు నెలకు రూ.18వేలు వేతనం ఇస్తామని హామీఇచ్చిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యురాలు బి.పల్లవి, కవిత, సుజాత, సుచిత్ర, సుమలత, శ్యామల, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.